క్లుప్తంగా

సాహు మహరాజ్ జయంతి

సీటీఆర్ఐ: కొల్హాపూర్ సంస్థానంలో 1902 జూలై 26న మొదటిసారిగా బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత రాజర్షి ఛత్రపతి సాహు మహరాజ్‌కు దక్కుతుందని మూల్ నివాసీ సంఘం జాతీయ అధ్యక్షుడు నయనాల కృష్ణారావు అన్నారు. మంగళవారం సాహు మహరాజ్ జయంతి సందర్భంగా సీతంపేటలోని బీసీ బాలికల వసతి గృహంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాహు మహరాజ్ తీసుకువచ్చిన సంస్కరణలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో చట్టబద్ధత కల్పించారని అన్నారు. బామ్‌సెఫ్ కేంద్ర కమిటీ సభ్యురాలు, సెంట్రల్ జైల్ చీఫ్ డాక్టర్ డాక్టర్ పితాని కోమల, విద్యార్థులు పాల్గొన్నారు.

సభ్యత్వ బదలాయింపునకు అవకాశం

కడియం: సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్‌లో సభ్యులుగా ఉండి, ఎవరైనా మృతి చెంది ఉంటే వారి సభ్యత్వాన్ని కుటుంబ సభ్యులకు బదలాయించుకునే అవకాశం ఉందని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. జూలై 16వ తేదీన ఎన్నికల నేపథ్యంలో జూన్ 30 లోపు ఈ మార్పు చేసుకోవాలని సభ్యులను కోరారు. రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్‌కార్డు కాపీతో అసోసియేషన్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

బొజ్జా తారకం సేవలు ఎనలేనివి

కడియం: హక్కుల పోరాట యోధుడు, కవి, రచయిత, న్యాయవాది బొజ్జా తారకం సేవలు ఎనలేనివని రిపబ్లికన్ పార్టీ నాయకులు నక్కా వెంకట రత్నరాజు అన్నారు. తారకం జయంతిని పురస్కరించుకుని పొట్టిలంకలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. నక్కా చంటిబాబు, రేముళ్ల ఏసు, ఎస్.శ్రీను, కొల్లపు వీరన్న, రేముళ్ల రాజ్ కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కేవీ వెంకటేశ్వర నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఏవీ అప్పారావు రోడ్డు, బాలాజీ స్ట్రీట్, వేంకటేశ్వర స్వామి గుడి ప్రాంతం, అద్దేపల్లి కాలనీ, కోదండ రామాలయం ఏరియా, శీలా నగర్, జవహర్ లాల్ నెహ్రూ రోడ్డు, కొక భాస్కరమ్మ నగర్, జయశ్రీ గార్డెన్స్, పిల్లి వారి స్ట్రీట్, శ్రీనివాస నగర్, శ్రీనివాస గార్డెన్స్, గోపాలనగర్ పుంత, విద్యుత్ కాలనీ, మహాలక్ష్మి ఆలయం ఏరియాలో సరఫరా ఉండదు.

- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ హౌసింగ్ బోర్డ్ ఏరియాలో మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం కలుగుతుంది.

వచ్చేనెల 31 వరకూ గడువు

కంబాలచెరువు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2023 – 24 విద్యా సంవత్సరానికి ఎంబీఏ, పీజీ డిప్లమో సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు జూలై 31వ తేదీతో గడువు ముగయనుంది. ఈ విషయాన్ని స్టడీ సెంటర్ రీజినల్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.వసుధ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, పూర్తి చేసిన వాటిని స్టడీసెంటర్‌లో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 73829 29614 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

అర్హులందరికీ లబ్ధి

రాజమహేంద్రవరం రూరల్: ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల ఎంపికే లక్ష్యంగా జగనన్న సురక్ష అమలు చేయనున్నట్లు మండల ప్రత్యేకాధికారి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి కేఎన్ జ్యోతి తెలిపారు. మండలంలోని హుకుంపేట, రాజవోలు, తొర్రేడు గ్రామ సచివాలయాల పరిధిలో జరుగుతున్న జగనన్న సురక్ష గృహ సందర్శన కార్యక్రమాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. గ్రామాల్లో వలంటీర్లు చేస్తున్న సర్వే విధానంతో పాటు డిజిటల్ అసిస్టెంట్లు దరఖాస్తులను కంప్యూటర్‌లో ఫీడింగ్ చేసేవిధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, తహసీల్దార్ పైడి చిన్నారావు, పంచాయతీ కార్యదర్శులు జి.వెంకటరావు, హనుమంతరావు, జి.కాశీవిశ్వనాథం పాల్గొన్నారు.

సర్వే త్వరగా పూర్తి చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: జగనన్న సురక్ష సర్వేను క్షేత్రస్థాయిలో త్వరగా పూర్తి చేసి, ధ్రువీకరణ పత్రాలకు జారీచేసే వారికి టోకెన్లు అందజేయాలని కమిషనర్ దినేష్ కుమార్ ఆదేశించారు. ఆయన మంగళవారం నగరంలోని 16, 19 సచివాలయాలను సందర్శించి, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 18 సచివాలయం పరిధిలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. అదనపు కమిషనరు సత్యవేణి పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

కడియం: సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రూపొందించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి సూచించారు. కడియపులంక పంచాయతీ పరిధిలోని వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లకు మంగళవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సొసైటీ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీనివాస్, పార్టీ నాయకులు బోడపాటి సత్యనారాయణ, కొత్తపల్లి శివాజీ, ఊటుకూరి శైలజ, బోడపాటి మూర్తి, ఆరేటి వెంకట్రావు, గాద రామకృష్ణ, అన్నందేవుల శ్రీను, తిరుమలశెట్టి వాసు, అయితరెడ్డి అయ్యప్ప, సింగంశెట్టి శ్రీను పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

- నత్తనడకన సాగితే ఎలా !
- కాంట్రాక్టర్‌పై ఎంపీ భరత్‌రామ్ అసహనం



మోరంపూడి ఫ్లైఓవర్ పనులపై కాంట్రాక్టర్, అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీ భరత్ రామ్



ఎంపీ భరత్ రామ్‌ను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో వేగం కనిపించడం లేదు, పనులు ఇలా నత్తనడకన సాగితే ఎప్పటికి బ్రిడ్జి పూర్తవుతుందంటూ కాంట్రాక్టర్ సురేష్ గౌడ్‌పై ఎంపీ మార్గాని భరత్ రామ్ అసహనం వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం మోరంపూడి ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. మొత్తం 8 పిల్లర్లలో నాలుగింటిని పైకి లేపి, ఆ తర్వాత మిగిలిన నాలుగు పిల్లర్లనూ పైకి లేపుతామని రెండు వారాల క్రితం ఎంపీకి కాంట్రాక్టర్ తెలిపారు. గత వారం ఎంపీ భరత్ దుబాయ్‌లో అవార్డు స్వీకరించడానికి వెళ్లడంతో పనులను పరిశీలించలేదు. ఈ మంగళవారం వచ్చి చూస్తే ఆ పనుల్లో పురోభివృద్ధి కనిపించలేదు. దీంతో సదరు కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మనుషులు లేకపోవడంతో పనుల్లో కాస్త జాప్యం జరుగుతోందని కాంట్రాక్టర్ సురేష్ గౌడ్, సైట్ ఇంజినీర్ సాయినాథ్, నేషనల్ హైవే మేనేజర్ సాల్మన్ అన్సారీ వివరణ ఇచ్చారు. ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ పనులను ఇలా నానుస్తుంటే, డిసెంబరు నెలాఖరు నాటికి ఎలా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. ఒక నిర్ణీత కాలంలో పనులు పూర్తవ్వాలని చెప్పినప్పుడు దానికి తగ్గట్టు కార్యాచరణ ఉండాలి కదా అని ప్రశ్నించారు. వచ్చే వారానికి ఈ పనులన్నీ పూర్తి చేసి, పురోభివృద్ధి చూపాలన్నారు. అలాగే ఎఫ్ఓబీ పనులు జరుగుతున్న మోరంపూడి జంక్షన్ వద్ద రాత్రి సమయాల్లో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా కనిపిస్తోందన్నారు. హెవీ వెహికల్స్ వెళుతుంటాయని, పనులు జరుగుతున్న కారణంగా పెద్ద లైట్లు ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్, నిర్వాహకులకు ఎంపీ సూచించారు.

డిసెంబర్‌కు పూర్తి చేస్తాం

మోరంపూడి ఎఫ్ఓబీ నిర్మాణం ఈ ఏడాదికి చివరకు పూర్తి చేసి, నూతన సంవత్సరం జనవరిలో జాతికి అంకితం చేస్తామని ఎంపీ భరత్‌రామ్ స్పష్టం చేశారు. కొన్ని కారణాల వల్ల పనుల్లో కాస్తంత జాప్యమైనా, దానిని అధిగమించి వేగంగా పనులు జరిగేలా చూస్తానన్నారు. వేమగిరి నుంచి కడియపులంక వరకూ సర్వీసు రోడ్డును తీసుకువచ్చి, సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేయిస్తానన్నారు. రాజమహేంద్రవరం నగర పరిధిలోని జాతీయ రహదారి ప్రధాన జంక్షన్లలో మిగిలిన ఎఫ్ఓబీలకు వచ్చే ఆగస్టులో శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఆయన వెంట మజ్జి అప్పారావు, నక్కా శ్రీనాగేష్, ఎన్వీ శ్రీనివాస్, బొప్పన సుబ్బారావు, పీతా రామకృష్ణ, ట్రాఫిక్ సీఐ నాగమోహన్‌రెడ్డి ఉన్నారు.

రచ్చబండకు వినతులు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ఎంపీ కార్యాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించిన రాజన్న రచ్చబండకు పలువురు మహిళలు విచ్చేసి వారి సమస్యలను ఎంపీ మార్గాని భరత్‌రామ్‌కు విన్నవించారు. వైద్య చికిత్సకు ప్రభుత్వ సహాయం కోసం, పింఛన్లు, కుటుంబ తగాదాలు, ఉద్యోగాలు ఇలా..పలువురు అర్జీలు అందజేశారు. సంబంధిత శాఖల అధికారులకు ఫోన్ చేసి ఎంపీ భరత్ మాట్లాడారు. బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.

ఎంపీ భరత్ రామ్ కృషి స్ఫూర్తిదాయకం

సీటీఆర్ఐ: పర్యావరణ పరిరక్షణ కోసం ఎంపీ భరత్ రామ్ చేపట్టిన కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ మాధవీలత అన్నారు. కలెక్టరేట్‌లోని స్పందన హాలులో మంగళవారం ఎంపీ మార్గాని భరత్ రామ్‌ను రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, కలెక్టర్ మాధవీలత, జేసీ ఎన్.తేజ్ భరత్, నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, పలువురు ఎమ్మెల్యేలు, వివిధ శాఖల జిల్లా అధికారులు సత్కరించారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ఎంపీ భరత్ రామ్ ఇటువంటి మరెన్నో అవార్డులతో పాటు, ప్రజలకు సేవ చేసేందుకు ఉన్నత పదవులు అధిష్ఠించాలని ఆకాంక్షించారు. జగనన్న హరిత నగరం స్ఫూర్తితో రాజమహేంద్రవరం నగరంలో పర్యావరణ పరిరక్షణకు పలు కార్యక్రమాలు చేపట్టి, ఇండో అరబ్ ఇంటర్నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు–2023ను దుబాయ్‌లో ఎంపీ భరత్ స్వీకరించిన విషయం విదితమే. అవార్డు స్వీకరించిన ఎంపీని నగరంలోని పలువురు ప్రముఖులు అభినందించారు. కార్యక్రమంలో అనపర్తి, గోపాలపురం, జగ్గంపేట ఎమ్మెల్యేలు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, తలారి వెంకట్రావు, జ్యోతుల చంటిబాబు, సర్పంచ్‌లు వై.సతీష్ చంద్రస్టాలిన్, టి.శ్రీనివాసరావు, వి.రవికుమార్ పాల్గొన్నారు.

జిల్లాలో జగనన్న సర్వే సంతృప్తికరం

- పంచాయతీరాజ్ కమిషనర్, జిల్లా ప్రత్యేకాధికారి వివేక్ యాదవ్
- జేగురుపాడు, మురమండ గ్రామాల సందర్శన



జేగురుపాడులో జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి వివేక్ యాదవ్, చిత్రంలో సర్పంచ్ స్టాలిన్ తదితరులు

కడియం: జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటీర్లు ప్రతి ఇంటిని కచ్చితంగా సందర్శించి, సమగ్ర సర్వే చేపట్టి, మిగిలి ఉన్న అర్హులను గుర్తించాలని జిల్లా ప్రత్యేకాధికారి వివేక్ యాదవ్ అన్నారు. మండలంలోని జేగురుపాడులో సచివాలయం, ఆర్బీకే, అంగన్‌వాడీ కేంద్రం, హౌసింగ్ లేఅవుట్, మురమండ సచివాలయం, కడియం ప్రభుత్వ ఆసుపత్రులను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వివేక్‌యాదవ్ మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం క్రింద గృహ సందర్శన సందర్భంగా వలంటీర్ సర్వేలో తీసుకుంటున్న అభిప్రాయ సేకరణ, పథకాల ద్వారా అందుతున్న ఆర్థిక ప్రయోజనాల వివరాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. పథకాలపై అందరూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. అర్హత ఉండి పథకాలు పొందని వారికి గుర్తించి, వారికి ఆయా పథకాలను అందించేందుకు క్షేత్రస్థాయిలో వలంటీర్లు సర్వే చేస్తారని వివేక్ యాదవ్ వివరించారు. మండల స్థాయిలో రెండు బృందాలు, పురపాలక, నగర పాలక పరిధిలో రెండు బృందాలు చొప్పున ఏర్పాటు చేశామని కలెక్టర్ మాధవీలత చెప్పారు. జేగురుపాడులో ఆర్బీకేను సందర్శించిన ప్రత్యేకాధికాధికారి కౌలుపత్రాల జారీ, ఈకేవైసీ, జగన్న హౌసింగ్ లేఅవుట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ పరిధిలో అందిస్తున్న సేవల రికార్డుల నిర్వహణపై సంబంధిత డిజిటల్ అసిస్టెంట్ నుంచి వివరాలు సేకరించారు. జేగురుపాడు సమగ్ర అభివృద్ధిపై సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్‌ను అభినందించారు.

ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

కడియంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ప్రత్యేకాధికారి వివేక్ యాదవ్, కలెక్టర్ మాధవీలతతో కలిసి తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలో కొత్తగా ఏర్పాటు చేసిన వైద్య పరికరాలు, వాటి ద్వారా అందిస్తున్న సేవలను పరిశీలించారు. చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు జిల్లా యంత్రాంగం నూతనంగా ప్రవేశపెట్టిన బంగారు కొండ కార్యక్రమం ఆసక్తి కలిగిస్తోందని వివేక్‌యాదవ్ అన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణకు అదనంగా బంగారుకొండ కార్యక్రమాన్ని ప్రారంభించామని కలెక్టర్ వివరించారు. ఆరు నెలల పాటు పౌష్టికాహారపు కిట్లను చిన్నారులకు అందిస్తారన్నారు. జిల్లా ప్రత్యేకాధికారి వెంట డీఎల్‌డీవో వీణాదేవి, కొవ్వూరు డీఎల్‌డీవో శాంతమణి, ఆర్డీవో చైత్రవర్షిణి, జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం, హౌసింగ్ పీడీ రాములు, డీఆర్‌డీఏ పీడీ సుభాషిణి, తహసీల్దార్ ఎం.సుజాత, మండల పరిషత్ ఏవో చంద్రరావు, ఈవోపీఆర్‌డీ వైవీవీఎస్ లక్ష్మి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి



మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ప్రత్యూష కుమారి

ధవళేశ్వరం: కార్మికులు భద్రతా ప్రమాణాలను పాటిస్తూ పనిచేయాలని జిల్లా న్యాయసేవాధికార కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. మంగళవారం ధవళేశ్వరం హార్లిక్స్ ఫ్యాక్టరీలో కార్మికులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రత్యూష కుమారి మాట్లాడుతూ కార్మికులకు ఎలాంటి న్యాయ సమస్యలు ఉన్నా, అర్హత కలిగిన వారికి సంక్షేమ పథకాలు అందకపోయినా జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ విధులు, ఉచిత న్యాయ సేవల గురించి వివరించారు. లేబర్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ బీఎస్ఎం వలీ మాట్లాడుతూ కనీస వేతనాల చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో హార్లిక్స్ ఫ్యాక్టరీ హెచ్ఆర్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

వారాహి మాతకు పూజలు



వారాహి మాత పూజలో పాల్గొన్న భక్తులు

సీటీఆర్ఐ: ఆర్యాపురంలోని కాలభైరవ గురు సంస్థాన్ మఠం, కాలభైరవ స్వామి క్షేత్రంలో కాలభైరవ స్వామీజీ ఆధ్వర్యంలో వారాహి గుప్త నవరాత్ర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారాహి దేవికి వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి సారె సమర్పించారు. మంగళవారం ఆఖరిరోజు సందర్భంగా వారాహిమాతకు సప్తనదీ జలాలు, పంచ సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. మఠం ట్రస్టీ మహేశ్వరి, ట్రాఫిక్ డీఎస్పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైభవంగా కొత్త అమ్మవారి జాతర



ఆకట్టుకున్న వేషధారణలు




అమ్మవారి గరగలకు పూజలు చేస్తున్న భక్తులు

ధవళేశ్వరం: స్థానిక గ్రంథాలయం సమీపంలోని శెట్టిబలిజపేట వద్ద వెలసిన కొత్త అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. కోదండ రామాలయం కమిటీ ఆధ్వర్యంలో గౌడ, శెట్టిబలిజ సంఘం పర్యవేక్షణలో వైభవోపేతంగా నిర్వహించారు. కమిటీ సభ్యుడు బసనబోయిన సత్తిబాబు, యూత్ సభ్యుల ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిపారు. జాతరను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన శక్తి వేషధారణలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. భారీ బాణసంచా కాల్పుల మధ్య అమ్మవారి ఆలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా సాగింది. అంతకు ముందు ఉదయం అమ్మవారి గరగలను ఊరేగించారు. ప్రతి ఇంటివద్ద మహిళలు అమ్మవారికి హారతులు ఇచ్చి, పసుపు నీళ్ల జల్లి మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బాలాజీపేట రోడ్డుకు మోక్షం

- రూ.3 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- త్వరలో ప్రారంభం కానున్న పనులు



గోతులమయంగా ఉన్న బాలాజీపేట రోడ్డు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు నుంచి బాలాజీపేట రోడ్డులోని గోతుల సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. ఐఎల్‌టీడీ సెంటర్ నుంచి కేశవరం వరకూ 13 కిలోమీటర్ల మేర నూతనంగా రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు రూ.3 కోట్లు మంజూరు చేసింది. దీనికి సంబంధించిన పనులను త్వరలోనే మొదలు పెట్టనున్నట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఐఎల్‌టీడీ సెంటర్ నుంచి కేశవరం వరకూ 13 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రోడ్డు ఉంది. అయితే బొమ్మూరు సెంటర్ నుంచి బాలాజీపేట జంక్షన్ వరకూ మరమ్మతులు చేసినప్పటికీ ఇటీవల కురిసిన వర్షాలతో గోతులమయంగా మారింది. అలాగే శృతి హాస్పటల్ వద్ద వర్షం కురిసినప్పుడల్లా ముంపు సమస్య ఏర్పడుతోంది. దీనికి శాశ్వత పరిష్కారం చేపట్టేలా వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత దృష్టికి తీసుకువెళ్లారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి నియోజకవర్గ అభివృద్ధి పనులలో భాగంగా బొమ్మూరు నుంచి బాలాజీపేట జంక్షన్ వరకూ ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరడం జరిగింది. ఈ నేపథ్యంలో ఐఎల్‌టీడీ సెంటర్ నుంచి బాలాజీపేట, బొమ్మూరు మీదుగా కేశవరం వరకూ 13 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలోనే ఆర్‌అండ్‌బీరోడ్డు నిర్మాణ పనులను చేపట్టనున్నారు.

శాశ్వత పరిష్కారం

ఐఎల్‌టీడీ సెంటర్ నుంచి కేశవరం వరకూ 13 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయి. బొమ్మూరు నుంచి బాలాజీపేట జంక్షన్ వరకూ మరమ్మతులు చేసినప్పటికీ వర్షాలు కురిస్తే గోతులమయంగా మారుతోంది. ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

– ఎస్‌బీవీ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఆర్‌అండ్‌బీ

అర్హులందరికీ ఇళ్లు

రాజమహేంద్రవరం సిటీ: అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేసి, గృహాలు కట్టించే ఇచ్చే బాధ్యత తనదేనని ఎంపీ మార్గాని భరత్ రామ్ హామీ ఇచ్చారు. మంగళవారం 29వ డివిజన్‌లోని భారత్ బొమ్మలు, ప్రసూతి హాస్పిటల్ నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీని మరోసారి గెలిపించాలని కోరారు. చదువు మానివేసిన విద్యార్థితో మాట్లాడి, ఇబ్బందులు తెలుసుకున్నారు. చదువుకు సహకరిస్తానని మాటిచ్చారు. యోగానంద ఆసుపత్రిలో నుంచి చుట్టుపక్కల ఇళ్లల్లోకి పాములు వస్తున్నాయని పలువురు ఫిర్యాదు చేశారు. నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, వైఎస్సార్ సీపీ నాయకుడు పిల్లి శ్రీనివాసరావు, 28వ డివిజన్ ఇన్‌చార్జ్ బిల్డర్ చిన్న, క్లస్టర్ ఇన్‌చార్జ్ కొత్త విజయ రాజ్యలక్ష్మి, సంకిన భవానీ ప్రియ, పోలు విజయలక్ష్మి, మజ్జి అప్పారావు, పీతా రామకృష్ణ, కాటం రజనీకాంత్ పాల్గొన్నారు.

20 రోజుల పాటు సర్వే

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా వ్యాప్తంగా 20 రోజుల పాటు నిర్వహించే కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ సర్వే ద్వారా కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించాలని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. బొమ్మూరులోని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం పోస్టర్లను డీఎల్ఏటీవో డాక్టర్ వసుంధరతో కలిసి ఆయన ఆవిష్కరించారు. డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి జూలై 16 వరకూ లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ జరుగుతుందన్నారు. ఇంటింటికీ ఆరోగ్య కార్యకర్తలు సర్వే నిర్వహిస్తారన్నారు. డీఎల్ఏటీవో డాక్టర్ ఎస్.వసుంధర మాట్లాడుతూ ఆశలు, వలంటీర్లు ఇంటింటి సర్వే ద్వారా నమోదు చేసిన కేసులను ఏఎన్ఎం సూపర్‌వైజర్‌గా ఉండి, ఏఎన్ఎం ట్యాబ్‌లో సర్వేను, అనుమానిత కేసులను ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. డాక్టర్ లక్ష్మీదేవి, డీపీఎంఓ ఈశ్వరరావు, డాక్టర్ అభిషేక్ రెడ్డి, డీఎంఓ వీర్రాజు పాల్గొన్నారు.

మహా పాదయాత్రకు సంఘీభావం తెలపండి

ప్రకాశం నగర్: పోలవరం నిర్వాసితుల పోరుకేక మహా పాదయాత్రకు ప్రజలు మద్దతు తెలపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముంపు ప్రాంత ప్రజలు సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నిర్వాసితులు పోరుకేక పేరుతో మహా పాదయాత్ర చేస్తున్నారని తెలిపారు.

సన్నాహక సమావేశం

సీటీఆర్ఐ: సిటీ నియోజకవర్గంలో గురువారం జరిగే భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్యయాత్రకు సంబంధించి స్థానిక తిలక్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు సమావేశమయ్యారు. రూట్ మ్యాప్, పూజా కార్యక్రమాలు, బైక్ ర్యాలీ తదితర అంశాలపై చర్చించారు.